వరకైనా ఎరగకుండా క్రొత్తనిబంధనను మనం అర్థం చేసుకొనలేము. పాత నిబంధనను మనం అర్థం చేసుకొనే కొలదీ క్రొత్త నిబంధనను అర్థం చేసుకోగలం.

**చారిత్రక వాస్తవములు**

చరిత్రలోని వాస్తవాలను మనకు పాత నిబంధన అందజేయుచున్నది. గనుక దాన్ని మనం చదవాలి. చరిత్రాత్మక విషయాల్లో పాతనిబంధన నమ్మతగినదని, యధార్థమైనదని యేసే మనకు తెలియజేసారు. (మత్తయి 19:4; 22:29). దేవుని యొక్క ఉనికిని గూర్చి సృష్టినిగూర్చి, మానవుని ఆరంభాన్ని గూర్చి, జలప్రళయాన్ని గూర్చి మొదలైన అట్టివాటిని గూర్చి మనకు ఖచ్చితమైన సమాచారం ఇంకెక్కడ దొరకును? వీటిని గూర్చి అక్కడక్కడా మనకు కొంత సమాచారం దొరుకుతుంది గాని అది అంత నమ్మ తగినది, అధికార యుక్తమైనదికాదు. పాతనిబంధన యధార్థమైనది మాత్రమే కాదు గాని అది అధికార యుక్తమైనది. ఆత్మావేశముచే లిఖింపబడిన సత్యమని నిరూపించుకొన్నది.

పాత నిబంధన ఈలోకరక్షకుడగు యేసుక్రీస్తును సూచించుచున్నందున ముఖ్యంగా దాన్ని మనం పఠనం చేయాలి. మోషే ధర్మశాస్త్రాన్ని నిత్యము ఉండేదిలా దేవుడు ఉద్దేశించలేదని పాతనిబంధన విపులంగా బయలు పరుచుచున్నది. ''ఇదిగో నేను ఇశ్రాయేలు వారితోను యూదా వారితోను క్రొత్త నిబంధనచేయు దినములు వచ్చుచున్నవి" యని ఆయన చెప్పారు (యిర్మీయా 31:31-34). మోషేధర్మ శాస్త్రము ఒక ప్రత్యేక ప్రయోజనం కొరకు తాత్కాలికంగా ఉద్దేశించబడినదని అపొ. పౌలు చెప్పాడు. ఆ ప్రయోజనం నెరవేరిన తరువాత దాని అవసరత ఇక లేకపోవును (గలతీ 3:10-25).

మెస్సీయను గూర్చి ఆయన రాజ్యాన్ని గూర్చి పాతనిబంధనలో 400 కంటే పైగా ప్రవచనములున్నవి. అంతే గాకుండా దానిలోని కొన్ని



సందర్భములు, వ్యక్తులు, సంస్థలు క్రీస్తుకు మాదిరిగాను, రాబోవు సంగతుల ఛాయగానుయున్నవి. "లేఖనములయందు మీకు నిత్య జీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుడి. అవే నన్ను గూర్చి సాక్ష్య మిచ్చుచున్నవి'' యని యేసుప్రభువు చెప్పారు (యోహాను 5:39).

వీటన్నిటిబట్టి పాతనిబంధనను చదువుట అవసరం అని మనం గ్రహించుకోగలము. మనము పాత నిబంధనకు బద్ధులము కాకపోయినను దాన్ని చదువుట అత్యవసరం. క్రీస్తు ప్రభువును, ఆయన రక్షణమార్గాన్ని ఆయన సంఘాన్ని మరింత అర్థం చేసుకోవాలంటే పాతనిబంధన లేఖనాలను చదువుట అవసరం. "కావున మనము వినిని సంగతులను విడిచిపెట్టి కొట్టుకొని పోకుండునట్లు వాటియందు మరి విశేష జాగ్రత్త కలిగి యుందము' (హెబ్రీ 2:1).

**- జాషువా గూటం**

# ఎస్తేరు
## ( Esther )

ప్రతియుగంలోను అసాధారణ మైన వ్యక్తులుంటారు. ఎస్తేరు ఒక అసాధారణమైన వ్యక్తి. పర్షియా దేశపు రాణి కాకముందు తన జీవితంలో ఆమె కనీసం నాలుగు ప్రతికూల సంగతుల నెదుర్కొనవలసి వచ్చినది.

**మొదటిగా, తన బాల్యదశలోనే తల్లిదండ్రులను ఆమె కోల్పోయినది.**

ఒక బాలిక తన జీవితంలో తలిదండ్రు లను కోల్పోవుట గొప్ప దుర్ఘటన. తన బంధువైన మొర్దెకై యొక్క ప్రేమకు ఆమె కృతజ్ఞత కలిగి యుండినను, తలిదండ్రు లతో పెంచబడుట కంటే మించిన సంతోషం మరొకటి లేదు.

**రెండవదిగా, ఆమె వ్యక్తిత్వము అపూరూపమైనది.**

"ఎస్తేరును చూచిన వారందరికి ఆమె యందు దయ పుట్టెను" (2:15). దైవానుగ్రహమా? అవును.

**మూడవదిగా, ఆమె గౌరవ్రద మైన విధేయతను కనుబరచెను.**

రాణి గా ఆమెకు కిరీటము ధరింపబడినను "ఎస్తేరు మొర్దెకై యొక్క పోషణ మందున్న కాలమున చేసినట్టుగానే ఇప్పుడును అతని మాటకు లోబడు చుండెను" (2:20). ఆమె పర్షియా దేశపు మహారాణి! ఆమె శక్తి వంతమైనది, సంపదగలది, ప్రఖ్యాతి గాంచినది. ఆమె మొర్దెకైను మరచి పోవుట చాలా సులభం, అతనిని చిన్న చూపు చూడవచ్చును. గాని ఎస్తేరు అట్లు చేయలేదు.

**నాల్గవదిగా, తన ప్రజల నిమిత్తము ఆమె తన ప్రాణమును సహితము కోల్పోవుటకు సంసిద్ధురాలా యెను.**

"నేను రాజు నొద్దకు ప్రవేశించు దును; నేను నశించిన నశించెదను" అని ఆమె చెప్పెను. ఏలయనగా రాజు నొద్దకు పిలువబడకుండా ప్రవేశించుట చట్టవిరుద్ధము (4:16). ఆమె తన శక్తిని, స్థానమును, సంపదను, ప్రఖ్యాతిని చివరకు తన ప్రాణమును సయితము త్యాగము చేయుటకు సిద్ధ పడెను.

ఒక వ్యక్తి జీవిత విషాదముల నుండి, దేవతార్చన నుండి లేచి గొప్ప విపత్తుల నెదుర్కొని, ఈ లోకమునకు ఆశీర్వాదకారకురాలు కాగలదనుటకు ఎస్తేరు సజీవసాక్షి!

– ఫ్రేంక్ చెస్సర్